క్లుప్తంగా

గద్దర్ జయంత్యుత్సవాలను జయప్రదం చేయండి

మిరుదొడ్డి(దుబ్బాక): హైదరాబాద్‌లో ఈనెల 31న నిర్వహించే ప్రజా యుద్ధ నౌక గద్దర్ జయంత్యుత్సవాలను జయప్రదం చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం, గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే గద్దర్ జయంత్యుత్సవాల పోస్టర్లను బుధవారం మండల పరిధిలోని లింగుపల్లిలో అంబేడ్కర్ సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ప్రొఫెసర్ కేఎస్. రత్నంతో పాటు ప్రజా దళిత సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం, డీబీఎఫ్ నాయకులు జె. బాల్‌నర్సు, బడుగు భూషణం, కె. రవి, పి. భిక్షపతి, పి. కిరణ్, స్వామి, కట్ట రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరు గ్రామంలోని ఉన్నత పాఠశాలల్లో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటివారికి ఉత్సాహంగా బోధన చేశారు. డీఈఓగా లిఖిత, డిప్యూటీ ఈఓగా వి. అల్యేఖ, ఎంఈఓ మనీషా, ప్రధానోపాధ్యాయురాలిగా జి.శృతి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులుగా మిగతా విద్యార్థులు చక్కగా విధులను నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విధానాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శి నియామకం కోసం వినతి



డీపీఓకి వినతిపత్రం అందజేస్తున్న హనుమతండా యువకులు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలం హనుమతండాకు గ్రామ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని గ్రామ యువకులు కోరారు. డీపీఓ దేవకీదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పంచాయతీ కార్యదర్శిని నియమించాలన్నారు. డీపీఓ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

తహసీల్దార్‌గా సరిత బాధ్యతల స్వీకరణ



కుకునూరుపల్లి మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపడుతున్న సరిత

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల తహసీల్దార్‌గా సరిత బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఆస్థానంలో పని చేసిన మల్లికార్జున్‌రెడ్డి అక్బర్‌పేట(భూంపల్లి) మండలానికి బదిలీ అయ్యారు. నంగునూర్ మండల తహసీల్దార్‌గా పని చేసిన సరిత ఇక్కడకు బదిలీ అయ్యారు. ఆమెకు మల్లికార్జున్‌రెడ్డి బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయండి

గజ్వేల్‌రూరల్: సీపీఎస్(కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్)ను రద్దు చేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డి, జోన్ కన్వీనర్ శ్రీనివాస్‌యాదవ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మోడల్‌స్కూల్‌తో పాటు మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్, తిమ్మకపల్లి, కోదండరామ్‌పల్లి, గుండన్నపల్లి, మండల పరిధిలోని బూర్గుపల్లి, కొడకండ్ల, రిమ్మనగూడ, ధర్మారెడ్డిపల్లి, కోమటిబండ, దాచారం గ్రామాల్లోగల పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఉపాధి కూలీలకు నిబంధనలు

- 20 రోజులు పనులు తప్పనిసరి చేయడమే కారణం
- ఆత్మీయ భరోసాకు మోకాలడ్డు
- ఈ పనులకు వెళ్లే కుటుంబపోషణ కష్టమని ఆవేదన



తోటపల్లి చెరువు పూడిక పనుల్లో కూలీలు (ఫైల్)

ఆత్మీయ భరోసాకు ఉపాధి కూలీలు దూరమవుతున్నారు. ఉపాధి పథకంలో 20 రోజులు పనులు చేయాలనే నిబంధన అడ్డుగా మారింది. ఈ సాకు చూపి పథకం వర్తించదని, గ్రామసభల్లో ప్రకటించిన జాబితాలో పేర్లు సైతం లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ పనులు చేస్తే కుటుంబపోషణ కష్టతరం అవుతుందని చెబుతున్నారు. ఇంకోవైపు జాబ్‌కార్డులను ఇన్‌యాక్టివ్ చేస్తుండటంతో సందిగ్ధంలో పడుతున్నారు.

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలంలో 4,521 జాబ్ కార్డులు ఉంటే అందులో 9,717 కూలీలు ఉన్నారు. జిల్లా అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లకు కూలీలను పెంచాలని టార్గెట్ పెట్టడంతో పనులకు రాని 1,205 జాబ్ కార్డులను ఇన్‌యాక్టివ్ పెట్టడంతో 3,941 కూలీలు ఉపాధి పనులు చేసుకునే అవకాశం కోల్పోయారు. జిల్లావ్యాప్తంగా గతంలో మరుగుదొడ్లు, పశువుల పాకలు, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి పనులు కల్పించిన సమయంలో అధికారులు ప్రతీకుటుంబానికి జాబ్ కార్డులు అందజేశారు. వేసవి ఉపాధి హామీ పని దినాల నిబంధనను తొలగించాలని కోరుతున్నారు. కాగా, జాబ్‌కార్డు ఉన్న ప్రతీకుటుంబానికి 100 రోజుల పనులను అధికారులు కల్పించాలి ఉంది. చాలా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లకు అందుబాటులో ఉన్న కూలీలకు పని కల్పించి వారి విధులు ముగించుకున్నారు. అధికారుల టార్గెట్‌ను చేరుకోవడానికి అసిస్టెంట్లు కూలీల జాబ్ కార్డులను ఇన్‌యాక్టివ్‌లో పెట్టి కూలీల సంఖ్య తగ్గించారని విశ్వసనీయ సమాచారం. దీంతో నిరుపేద కుటుంబాలకు ఆత్మీయ భరోసా వర్తించని పరిస్థితి.

ఇద్దరు పనికెళ్తేనే పూటగడిచేది



మాకు ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉంది. మహిళా సంఘం చిట్టీలు కట్టాలంటే ఉపాధి హామీ పనికి పోతే వారం రూ.500లు కూడా రావు. నా భర్తతో కలిసి నేను మేస్త్రీ పనికి వెళ్తే రోజుకు రూ.1200లు ఇస్తారు. మేస్త్రీ పని లేనప్పుడు ఉపాధి హామీ పనికి పోతున్నాం. 20 రోజులు నిండలేదని మాకు ఆత్మీయ భరోసా రాదన్నారు. మాకు గుంట భూమి సైతం లేదు.

– గద్ద రాజేశ్వరి, కూలీ గాంధీనగర్

చేయి విరిగినప్పటి నుంచి..



మా ఊరులో ఉపాధి హామీ పనికి వెళ్తుంటా. చేయి విరిగినప్పటి నుంచే వెళ్లడం లేదు. మాకు గుంట భూమి లేదు. ఇంట్లో ముగ్గురం కూలీ పనికి పోతేనే పూటగడిచేది. నా చేయి విరిగినప్పటి నుంచి మా కొడుకులు కూలీ పనికి వెళ్తున్నారు. గడిచిన 6 నెలల వరకు ఉపాధి పనులు వెళ్లాను. భూమి లేని అందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తిస్తుందంటే ఆశపడ్డాం. గ్రామసభలో పేర్లు చదివితే మా పేరు రాలే దు. నిలదీస్తే 20 రోజులు పని దినాలు నిండలేదన్నారు.

– ముద్రకోళ్ల సరోజన, కూలీ మీర్జాపూర్

ఆ కుటుంబాలకు ఆత్మీయ భరోసా



గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు పని కల్పిస్తున్నాం. రెండేళ్లుగా పనికి రాని కుటుంబాల జాబ్ కార్డులను ఇన్‌యాక్టివ్‌లో పెట్టాం. మళ్లీ పనికి వస్తే పునరుద్ధరిస్తాం పని కల్పిస్తాం. 2023–24లో కనీసం 20 పని దినాలు ఉన్న కూలీలకు ఆత్మీయ భరోసా వస్తుంది.

– పద్మ, ఏపీఓ, హుస్నాబాద్

షరీఫ్ దర్గా ఉత్సవాలు ప్రారంభం

సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఉన్న ముర్షద్‌గఢ్ ఖాజా మహమ్మద్ హకీం షరీఫ్ చిస్తీ దర్గాలో ఉర్సు షరీఫ్ ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం చందన, సుగంధములు సమర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)



మందకృష్ణకు పద్మశ్రీ ప్రకటించడం హర్షణీయం

గజ్వేల్‌రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డును ప్రకటించడం అభినందనీయమని ప్రజ్ఞాపూర్ అంబేడ్కర్ సంఘం, జైభీమ్ యూత్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పూలమాలలు వేసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. ఎంఈఎఫ్ మండల అధ్యక్షుడు సల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ పురస్కారాల్లో అణగారిన వర్గాల పక్షాన, వారి హక్కుల కోసం పోరాడిన నాయకుడు మందకృష్ణ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ, నాయకులు మైస రాములు, అంబేడ్కర్ సంఘం నాయకులు నర్సయ్య, భిక్షపతి, దుర్గయ్య, చంద్రయ్య, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంటు పోయినది

శివమాళ్ళ బాలామణి భర్త యల్లా గౌడ్, ఇం.నం.3-16, ధర్మారెడ్డిపల్లి గ్రామం, గజ్వేల్ మండలం, సిద్దిపేట జిల్లా, తెలంగాణ రాష్ట్రం వాసినైన నేను నా యొక్క ఒరిజినల్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నం.5949/2013, తేదీ:20-08-2013ను ధర్మారెడ్డిపల్లి నుండి ప్రజ్ఞాపూర్ గ్రామానికి బైక్‌పై ప్రయాణిస్తుండగా పోగొట్టుకున్నాను. ఎంతవెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికినచో సంప్రదించగలరు.

మొబైల్ : 8179625715

శత శాతం వసూలు చేయాల్సిందే

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్



సిద్దిపేటజోన్: మాట్లాడుతున్న ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు సమష్టిగా పని చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణ స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. బ్యాంకు లింకేజీ టార్గెట్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఫిబ్రవరి నెలాఖరు లోగా లక్ష్యం అధిగమించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన వారందరికీ ప్రధాని స్వనిధి లోన్ డాక్యుమెంటేషన్ పూర్తి చేయాలని సూచించారు. మహిళలకు సోలార్ మెగా ప్లాంట్ ఏర్పాటు కోసం స్థలాన్ని సైతం ఇస్తామని పేర్కొన్నారు. మున్సిపాలిటీ విధుల్లో ఆర్పీలు భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇంటి పన్ను వసూలు లక్ష్యంలో భాగంగా అధిక మొత్తంలో వసూలుకు ఆర్పీలు దోహదపడాలని సూచించారు. ఫిబ్రవరిలో 90 శాతం పన్నులు వసూలు లక్ష్యం అధిగమించేందుకు తోడ్పాటు అందించాలని సూచించారు. మార్చి 31 వరకు 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ డీఈ ప్రేరణ, డీఎంసీ హన్మంతారెడ్డి, రెవెన్యూ అధికారి శ్రీకాంత్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, అజ్మత్, టీఎంసీ సాయి, సీఓ రమ్య, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

పన్నులు చెల్లించాలి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, వ్యాపారులు పన్నులు చెల్లించి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్‌లతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. 2024–25కుగాను ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్‌లకు సంబంధించిన పన్నులను చెల్లించాలన్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెలుకలపల్లి గ్రామస్తుల ఆందోళన



నిరసన తెలుపుతున్న చెలుకలపల్లి గ్రామస్తులు

పంప్‌హౌస్ వద్ద పనులు అడ్డగింత

చిన్నకోడూరు(సిద్దిపేట): అనంతగిరి రిజర్వాయర్, మరోవైపు అదనపు టీఎంసీ కాలువ నిర్మాణంతో తాము గ్రామంలో ఉండలేకపోతున్నామని మండలంలోని చెలుకలపల్లి గ్రామస్తులు బుధవారం ఆవేదన వ్యక్తంచేశారు. పంప్ హౌస్ వద్ద పనులు అడ్డుకుని నిరసనకు దిగారు. రిజర్వాయర్ వల్ల ఇళ్లలోకి నీళ్లు, విష కీటకాలు వస్తున్నాయన్నారు. అదనపు టీఎంసీ నిర్మాణంలో చేపట్టే బ్లాస్టింగ్‌లతో ఇళ్లపై రాళ్లు పడుతున్నాయన్నారు. న్యాయం చేయాలని 10 రోజులుగా ఆందోళన చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. కాగా గ్రామానికి రావడానికి సరైన రోడ్డు మార్గం లేదని ఆరోపించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

తొగుట(దుబ్బాక): సేంద్రియ ఎరువుల వినియోగంతో పంట దిగుబడి అధికంగా వస్తుందని ఎల్లారెడ్డిపేట సెక్టార్ ఏఈఓ నాగార్జున రైతులకు సూచించారు. పెద్దమాసాన్‌పల్లి రైతు అనిల్ వ్యవసాయ క్షేత్రంలో జీవఎరువు అజాటోబ్యాక్టర్‌పై రైతులకు అవగాహన కల్పించారు. అధికంగా రసాయన ఎరువులు వాడకం మూలంగా నేల సారం క్షీణిస్తుందని, రైతులకు పెట్టుబడి పెరుగుతుందన్నారు. పెట్టుబడి తగ్గించుకునే దిశగా ఆలోచించాలని కోరారు. సేంద్రియ ఎరువుల్లో జీవన ఎరువులు కూడా ఒకటని తెలిపారు. దీంతో నేల సారవంతానికి, మొక్క ఎదుగుదలకు దోహదం చేస్తుందన్నారు. అజటోబ్యాక్టర్ సుమారుగా 30 శాతం రసాయనాల ఎరువుల వాడకం తగ్గిస్తుందని తెలిపారు. అజటోబ్యాక్టర్ పప్పు పంటలకు తప్ప మిగతా అన్ని రకాల పంటలకు వినియోగించవచ్చన్నారు. పంట వేసేముందు విత్తన, వేరు శుద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు.

బోనాల ఊరేగింపు



మిరుదొడ్డి(దుబ్బాక): ఊరేగింపులో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): మాఘ అమావాస్య సందర్భంగా బుధవారం అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని రుద్రారంలో గ్రామ దేవతలకు బండ్ల బోనాలను అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామస్తులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.

కార్యకర్తల సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం



బీమా చెక్కును అందజేస్తున్న వంటేరు

గజ్వేల్: కార్యకర్తల సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యమని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. కొండపాక మండలం గిరాయిపల్లికి చెందిన మైలారం సంతోశ్‌కుమార్ ఇటీవల కరెంట్ షాక్‌తో మృతిచెందాడు. పార్టీ తరుపున రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కును మృతుడి భార్య రాజేశ్వరీకి బుధవారం గజ్వేల్‌లో అందజేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బీఆర్‌ఎస్ కార్యకర్తలకు ప్రమాద బీమా అందించిన ఘనత పార్టీ అధినేత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యకర్తలు ఏ కష్టమొచ్చినా పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ కొండపాక మండల నాయకులు అనంతుల ప్రశాంత్, మండల అధ్యక్షుడు నూనె కుమార్, గిరాయిపల్లి మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, నాయకులు అహ్మద్, మల్లేశం, చంద్రమౌళి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనచోదకులు నిబంధనలు పాటించండి



గజ్వేల్‌రూరల్: వాహనదారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ మురళి

గజ్వేల్‌రూరల్: వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద వాహనదారులకు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్‌లు వాహనాలు నడపవద్దని, త్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్లో ప్రయాణం, మద్యం తాగి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు జరిగే ఆస్కారముందన్నారు. ట్రాఫిక్ ఏఎస్‌ఐ జగదీశ్వర్, సిబ్బంది సత్యనారాయణ, ఆటో డ్రైవర్లు, వాహనదారులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కేసు

కొండపాక(గజ్వేల్): మైనర్లు వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు నిబంధనలపై కొండపాకలో ఉన్న హైస్కూల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాహనదారులు చాలా చోట్ల రాంగ్ రూట్లో ప్రయాణిస్తూ ఇతరులను సైతం ప్రమాదంలో పడేస్తున్నారన్నారు. మద్యం తాగి వాహనాలను నడుపుతున్నారన్నారు. ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

తరించి.. పులకించి





మాఘ అమావాస్య పురస్కరించుకొని బుధవారం పాలమాకులలో కొలువైన దత్తాత్రేయుడి ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం ఆలయ నిర్మాణ కర్తలు చీకోటి వంశస్తులు.. స్వామివారికి అర్చన, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదం నివేదించారు. అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. పాలమాకుల, రాజగోపాల్‌పేట, వెంకటాపూర్, ముండ్రాయి గ్రామాల సరిహద్దులో జాతర జరుగగా వచ్చిన భక్తులు పవిత్ర గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. చీకటి పడగానే ఆలయాన్ని నిర్వాహకులు మూసివేశారు.

– నంగునూరు(సిద్దిపేట)

సంక్షిప్త వార్తలు

◆ నేడు మహాధర్నా

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జేఏసీ చైర్మన్ వకుళాభరణం నర్సయ్యపంతులు పిలుపునిచ్చారు. బుధవారం అఖిలపక్ష జేఏసీ నాయకులతో కలిసి ధర్నా స్థలాన్ని పరిశీలించారు.

◆ తొలి సెంచరీ నమోదు

సిద్దిపేటజోన్: సీఎం రేవంత్‌రెడ్డి క్రికెట్ టోర్నీలో తొలి సెంచరీ నమోదైంది. స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం గంగాపూర్, బక్రీ చెప్యాల జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 178 పరుగులను గంగాపూర్ జట్టు చేసింది. గెలుపే లక్ష్యంగా బరిలో దిగిన బక్రీ చెప్యాల జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 57 పరుగులకే పరిమితమైంది. టోర్నీలో తొలి సెంచరీ చేసిన ఉదయ్ కుమార్ రెడ్డిని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి అభినందించారు.

◆ ఆరోగ్య శిబిరం

చేర్యాల(సిద్దిపేట): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఆర్టీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో లారీ, ఆటో, ట్రాక్టర్, మోటారు క్యాబ్, స్కూల్ బస్సుల డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎంవీఐ క్రిస్టోఫర్ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు.

◆ విజయవంతం చేయండి

జగదేవ్‌పూర్(గజ్వేల్): లక్ష డప్పులు– వేల గొంతుల కార్యక్రమానికి మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు అధిక సంఖ్యలో తరలొచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జగదేవ్‌పూర్ మండల జేఏసీ, ఎంజేఎఫ్, ఎంఈఎఫ్ నేతలు యాదగిరి, రాజు, బాలకిషన్, బాబు, రామస్వామి పిలుపునిచ్చారు. మండలంలోని చాట్లపల్లి, జంగంరెడ్డిపల్లి, తీగుల్ నర్సాపూర్ గ్రామాల్లో బుధవారం డప్పు చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించారు. కొండపోచమ్మ ఆలయంలో ఎస్సీ వర్గీకరణ అమలయ్యేలా చూడాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ ప్రజలు సుభిక్షంగా ఉండాలి

తొగుట(దుబ్బాక): వేంకటేశ్వరస్వామి దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖ సంపదలతో సుభిక్షితంగా ఉండాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. వెంకట్రావుపేటలో బుధవారం నిర్వహించిన వేంకటేశ్వరస్వామి జాతరలో పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఎడ్లబండ్ల ఊరేగింపును ప్రారంభించారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ, చౌడాలమ్మ దేవాలయాల్లోనూ పూజలు నిర్వహించారు.

◆ 'అలా ఇవ్వడం కుదరదు'

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలం ఎంపీడీఓ కార్యాలయాల భవనం కోసం బుధవారం అధికారులు గ్రామ సభ ఏర్పాటు చేసి గ్రామస్తుల అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామ్మోహన్ గ్రామ పంచాయతీగా ఉన్న భవనాన్ని ఎంపీడీఓ కార్యాలయానికి కేటాయించాలని గ్రామస్తులను కోరారు. అలా ఇవ్వడం కుదరదన్నారు. అవసరమైతే చెందాలు వేసి ప్రైవేట్ భవనానికి అద్దె చెల్లిస్తామన్నారు. శాశ్వత భవనం నిర్మించాలని జిల్లా ఉన్నతాధికారులను కవలనున్నట్లు తెలిపారు.

◆ మెరుగైన విద్య అందించాలి

కొండపాక(గజ్వేల్): విద్యాప్రమాణాల స్థాయి పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి (ఎంఈఓ) బచ్చలి సత్తయ్య పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండలం తిప్పారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రూపొందించిన ప్రత్యేక క్యాలెండర్‌ను కుకునూరుపల్లి హైస్కూల్లో బుధవారం ఆవిష్కరించారు.

◆ జిల్లా కార్యదర్శిగా సత్యానారాయణ

సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రవీందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కూచంగారి శ్రీనివాసుల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

◆ పాఠశాల సందర్శన

సిద్దిపేటరూరల్: ఆర్టీఫ్ మాటిండ్ల పాఠశాలను విద్య, ఆర్థిక భాగస్వామి సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్ హైదరాబాద్‌కు చెందిన 53 మంది విద్యార్థులు, ఏడుగురు సిబ్బంది బుధవారం సందర్శించారు. పాఠశాలలో నిర్వహించిన అసెంబ్లీ, బాలమేళాను పరిశీలించారు. 5వ, 6వ తరగతి వారికి నాణ్యమైన విద్య, లింగ అసమానతలపై, 7వ, 8వ వారికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

సాక్షి

మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.

యం. నాగరాజు-9010957373

రమేష్ - 9951952990